సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేల ధర పలికాయి. మార్కెట్‌కు 51 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి



టమాట కిలో రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 ప్రకారం పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.6°/21.1°
జిల్లా పరిధిలో సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

8న ధర్మవరంలో జాబ్‌మేళా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

పుట్టపర్తి అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న ధర్మవరంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శుక్రవారం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈక్రమంలోనే ఈ నెల 8న ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, 13 రకాల కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, ఎల్‌డీఎం రమణకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మళాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ



పుట్టపర్తి మండలం ఇరగరాజుపల్లిలో నూతన పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వరలక్ష్మి

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. నాల్గోరోజు సోమవారం నాటికి జిల్లాలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. తొలిరెండు రోజులు ఇంటింటికీ తిరిగి పింఛన్ మొత్తం అందజేసిన వలంటీర్లు.. మూడు, నాలుగు రోజుల్లో పింఛన్ లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికే వెళ్తున్న పింఛన్ పంపిణీ చేశారు. దీంతో నాలుగు రోజుల్లోనే 2,59,935 మందికి రూ.72,17,23,250 నగదు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

గురుభ్యోనమః



నేడు ఉపాధ్యాయ దినోత్సవం

- తరగతి గదుల్లో దేశ నిర్మాణం చేస్తున్న ఉపాధ్యాయులు
- ఎందరో విద్యార్థుల జీవితాలకు బాటలు
- నిస్వార్థ సేవలతో పలువురికి ఆదర్శం

ఉపాధ్యాయులు తరగతి గదిలో దేశ నిర్మాణం చేస్తున్నారు. ప్రతి విద్యార్థినీ బిడ్డలా చూసుకుంటూ వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. విద్యతో పాటు వినయం, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, దేశభక్తిని నేర్పుతూ మెరుగైన సమాజం కోసం తమవంతు పాత్ర పోషిస్తున్నారు. శిష్యులు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అహరహం శ్రమిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులు ఖర్చు చేస్తూ ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. అలాంటి గురుదేవుళ్లను ప్రభుత్వం ఏటా సెప్టెంబర్ 5న 'ఉత్తమ' అవార్డులిచ్చి సత్కరిస్తోంది. ఈ సంవత్సరం 20 మందికి ఉత్తమ అవార్డులు దక్కగా... అందులో కొందరిపై సాక్షి ప్రత్యేక కథనం. – సాక్షి నెట్‌వర్క్:

సేవా ప్రభాకరుడు



పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యం జెడ్పీ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేస్తున్న ఎం.ప్రభాకర్ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారు. రాప్తాడుకు చెందిన ప్రభాకర్ ఎంఏ ఎంపీఈడీ పూర్తి చేసి 2008 డీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించారు. దాదాపు 12 ఏళ్లుగా ఎందరో విద్యార్థుల భవితకు బాటలు వేశారు. కేవలం వ్యాయామ తరగతులకే పరిమితం కాకుండా విద్యార్థులు ఒత్తిడి జయించేలా యోగాసనాలు నేర్పిస్తుంటారు. రక్తదానం చేయడంతో పాటు విద్యార్థులతో చేయిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు.

నిరుపేద విద్యార్థులకు ఆప్తుడు



సోమందేపల్లి స్నేహలత నగర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కిష్టప్ప నిరుపేద విద్యార్థులకు ఆప్తుడుగా నిలిచారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక సహకారం అందిస్తూ వారి భవితకు బాటలు వేస్తున్నారు. అలాగే ప్రత్యేక శ్రద్ధ చూపి 21 మంది విద్యార్థులను గురుకుల పాఠశాలకు పంపారు. పాఠశాల వద్ద చెట్లు నాటే కార్యక్రమం, దాతల ద్వారా గతంలో పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేయించారు.

జాతీయ స్థాయిలో సత్తా



బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో (పీఈ) పని చేస్తున్న నాగరాజు 22 ఏళ్లుగా ఎందరో విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. నాగరాజు వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటారు. నిరంతరం విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన పనిచేస్తారని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యార్థులను సొంత బిడ్డల్లా....



మడకశిర మండలం హరేసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న గిరిజాకుమారి విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటారు. తల్లిలా విద్యార్థుల పక్కనే కూర్చుని అర్థం కాని విషయాలు వివరిస్తారు. అర్థమయ్యేలా బోధించడంలో ఆమెకు ఆమెనే సాటి. సమయపాలనతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 'ప్రైవేట్' విద్యార్థులు ఆమె చొరవతో ప్రభుత్వ స్కూలులో చేరారు. జిల్లా అవార్డు దక్కడంపై గిరిజా కుమారి ఆనందం వ్యక్తం చేశారు. అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెబుతున్నారు.



విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు ఏఆర్ గిరిజకుమారి

విద్యాభివృద్ధికి తోడ్పాటు



ధర్మవరం పట్టణంలోని సుందరయ్యనగర్ శ్రీ గణేష్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షర్ఫుద్దీన్ విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా పనిచేస్తున్నారు. తనదైన శైలిలో పాఠాలు బోధించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. పేద విద్యార్థులు ఎందరికో ఆర్థికంగా చేయూతనందించారు. గతంలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో నలుగురు వలంటీర్లను నియమించి ప్రతినెలా జీతం ఇచ్చేవారు. ఇలా ఎనిమిదేళ్లు విద్యార్థుల కోసం సొంత డబ్బు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఇద్దరు వలంటీర్లకు సొంతంగా జీతాలిస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

నైతిక విలువలతో బోధన



నేటి సమాజంలో విద్యార్థులకు విద్య, క్రమశిక్షణ ఎంత ముఖ్యమో.. నైతిక విలువలు అంతే ముఖ్యమని నమ్ముతారు ఆర్.ఎడిత్ రోస్. ప్రస్తుతం ఆమె హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి సౌత్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సబ్జెక్టు బోధిస్తున్నారు. విద్యతో పాటు నైతిక విలువలను బోధిస్తూ వారిని సన్మార్గంలో నడిపిస్తున్నారు. ఆమె 2003 మార్చి 3న బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయురాలిగా వృత్తిని ప్రారంభించారు. అప్పటి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు, సామాజిక స్పృహ పెరగాలని తపిస్తూ విద్యాబోధన చేస్తున్నారు.

చిత్రాలతో బోధన



గోరంట్ల మండల పరిధిలోని బూదిలి ఉన్నతపాఠశాలలో బయోలాజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న బయపరెడ్డి బోధన ప్రత్యేకంగా ఉంటుంది. పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా చిత్రలేఖనం ద్వారా బోధిస్తుంటారు. దీంతో ఒకసారి పాఠం విన్న విద్యార్థి ఎప్పటికీ మరచిపోరని ఆయన చెబుతుంటారు. ఇందుకోసం చాలా కృషి చేస్తుంటారు. అందువల్లే ఆయన విద్యార్థులు పరీక్షల్లో సత్తా చాటుతుంటారు.

ఉత్తమ గురువులకు పురస్కారం

- జిల్లాలో 20 మందికి అవార్డులు
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నేడు పంపిణీ
- జగరాజుపల్లి మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో వేడుకలు

పుట్టపర్తి అర్బన్: భారత తొలి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల్లో చైతన్యం, భాష, క్రీడా, నైతిక వికాసానికి కృషి చేసిన 20 మంది ఉపాధ్యాయులకు 'ఉత్తమ' అవార్డులు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం డీఈఓ మీనాక్షి పరిశీలించారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ గోరంట్ల మాధవ్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు హాజరవుతారని ఆమె తెలిపారు.

జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులు....

టీచర్ పేరు	కేడర్	స్కూలు
కే.జ్యోతిర్మయి	హెడ్‌మిస్ట్రెస్ గ్రేడ్-2	జెడ్పీహెచ్‌ఎస్, ధనాపురం, పరిగి
వై.రమాదేవి	ప్రిన్సిపాల్	కేజీబీవీ, నల్లమాడ
డి.బయపరెడ్డి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీ బాలికల హైస్కూల్, పులేరు, గోరంట్ల
బి.నాగరాజు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీ బాలుర హైస్కూల్, బుక్కపట్నం
ఎం.ప్రభాకర్	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, వీజీపాళ్యం, పెనుకొండ
కే.హెబ్సిబాగ్రేస్	స్కూల్ అసిస్టెంట్	ఎంపీయూపీఎస్, కోనాపురం, పరిగి
కే.వెంకటేషులు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, తలమర్ల, కొత్తచెరువు
ఎం. షర్ఫుద్దీన్	ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం	మున్సిపల్ స్కూల్, ధర్మవరం
రమేష్‌బాబు నాయక్	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, దేమకేతుపల్లి, చిలమత్తూరు
బి. అనిత	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, పీకేపీ తండా, నల్లమాడ
జి.రమేష్	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, తిమ్మాపురం, పెనుకొండ
ఆర్.కొండయ్య	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, కే.వడ్డేపల్లి, లేపాక్షి
జి.శ్రీరాములు	ఎస్‌జీటీ	మున్సిపల్ స్కూల్, ధర్మవరం
ఆర్.ఎడిత్‌రోస్	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, ముదిరెడ్డిపల్లి, హిందూపురం
ఏఆర్. గిరిజాకుమార్	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, హరేసముద్రం, మడకశిర
ఎస్.సమీళ	సీఆర్టీ హిందీ	కేజీబీవీ, నల్లమాడ
ఎంకే. సత్యనారాయణ	పీఎస్ హెచ్‌ఎం	ఎంపీపీఎస్, గుర్రప్పకొండ, మడకశిర
కేఎస్ ఇస్మాయిల్‌ఖాన్	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, మామిడాకులపల్లి, లేపాక్షి
కే.కిష్టప్ప	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, స్నేహలత నగర్, సోమందేపల్లి
కే.గోపి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, ఇరగంపల్లి, కొత్తచెరువు

విద్యారంగానికే ఆదర్శం

మడకశిర పట్టణానికి చెందిన సత్యనారాయణ గుర్రప్పకొండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య బోధిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తున్నారు. సమయపాలనలోనూ, క్రమశిక్షణలోనూ ఆయన విద్యార్థులందరికీ ఆదర్శం. గుర్రప్పకొండ గ్రామస్తుల్లోనూ చైతన్యం తీసుకువచ్చి పిల్లలను సక్రమంగా పాఠశాలకు పంపే విధంగా కృషి చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్విజ్, ఇతర పోటీలు నిర్వహించి సొంత ఖర్చులతో వారికి బహుమతులు అందిస్తున్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి వారు ఏ పరీక్షలోనైనా విజయం సాధిస్తారని ఆయన చెబుతున్నారు. సత్యనారాయణ నమ్మకానికి తగ్గట్టే విద్యార్థులూ పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారు.



క్విజ్ పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సత్యనారాయణ

సమాజ హితుడు గోపి



కొత్తచెరువు మండలం ఇరగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోపి తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతూనే సమాజ హితానికి పాటు పడుతుంటారు. ముఖ్యంగా ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్ సమయంలో పలువురు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, మహిళలకు కుట్టు మిషన్‌లు అందించి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు.

కన్నీటి సంద్రం



భాస్కర్‌నాయక్ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య పతిబాయిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



శ్రీలేఖ కుమార్తెలు సుజిత, దీక్షితలను అక్కున చేర్చుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- కదిరి రోడ్డు ప్రమాదంలో మృతులకు అంత్యక్రియలు
- హాజరైన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి... బాధిత కుటుంబాలకు పరామర్శ
- రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాకు సీఎం జగన్ ఆదేశం

పుట్టపర్తి: భర్తను తలచుకుని భార్య... తల్లిని తలచుకుని పిల్లలు. తమవాళ్లను తలచుకుని బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇక తమకు దిక్కెవరంటూ బాధిత కుటుంబాలు రోదించడంతో ఆ ప్రాంతం కన్నీటి సంద్రాన్ని తలపించింది. ఆదివారం కదిరి సమీపంలోని యర్రదొడ్డి వద్ద ఆటోను కారు ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెందిన రెడ్డివారిపల్లి తండాకు చెందిన భాస్కర్ నాయక్(48), మదిరేబైలు తండాకు చెందిన చిన్నస్వామి నాయక్(35), ఎలక్ట్రీషియన్ చలపతి నాయక్ (37), మదిరేబైలుకు చెందిన శ్రీలేఖ (35) అంత్యక్రియలు కుటుంబీకులు, ఆప్తుల అశ్రునయనాల మధ్య సోమవారం స్వగ్రామాల్లో పూర్తయ్యాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ మృతులకు నివాళులర్పించారు. మదిరేబైలు తండా సర్పంచ్ విజయకుమారి బాయి, పిల్లలను, ఇదే తండాకు చెందిన చలపతినాయక్ భార్య నారాయణి బాయి, కుటుంబ సభ్యులను, రెడ్డివారిపల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్ భార్య పతి బాయి, కుటుంబ సభ్యులను, మదిరేబైలుకు చెందిన శ్రీలేఖ భర్త గోపాల్‌రెడ్డి, కుమార్తెలను ఎమ్మెల్యే ఓదార్చారు. అండగా ఉంటామని, అన్ని విధాలా సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. శ్రీలేఖ పిల్లలను ఓదారుస్తూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూడా కంటతడి పెట్టారు. అంత్యక్రియలు ముగిసే వరకూ అక్కడే ఉండి అన్నీతానై వ్యవహరించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించారు.

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా..

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ తెలిపారు. వీలైనంత త్వరగా పరిహారం అందేలా చూస్తామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఇతర ప్రయోజనాలు కూడా త్వరగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. మరోవైపు మృతులకు నివాళులు అర్పించేందుకు పలువురు నాయకులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు సుధాకర్‌రెడ్డి, కుళ్లాయినాయక్, ఎంపీపీలు శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీఆర్పీ కేశప్ప, కొత్తకోట సర్పంచ్ నాగమణి, ఆ గ్రామ సచివాలయం కన్వీనర్ కేశప్ప, ఎంపీటీసీ సభ్యుడు హర్షవర్ధన్‌రెడ్డి నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.

పోరాట 'పాఠం'



వినూత్న పద్ధతిలో బోధిస్తున్న కృష్ణవేణి

కదిరి అర్బన్: మండల పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న కృష్ణవేణి విద్యార్థులకు జీవిత పాఠం నేర్పుతున్నారు. విద్యార్థులను బిడ్డల్లా చూసుకునే ఆమె... సొంత ఖర్చులతో ఎందరో విద్యార్థుల భవితకు బాటలు వేశారు. ప్లేట్లు, గ్లాసులు, బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, ఇలా చాలావరకు విద్యాసామాగ్రిని సొంత జీతంతో కొనిచ్చేవారు. కేన్సర్ బారిన పడి జీవితంతో యుద్ధం చేస్తున్న ఆమె...తన విద్యార్థులు జీవితంలో ఓడిపోకుండా పోరాట పాఠం నేర్పిస్తున్నారు. అలాగే ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులతో చేతివృత్తులకు సంబంధించి పరికరాలు తయారు చేయిస్తుంటారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం, సృజనాత్మకత వెలికితీయచ్చని చెబుతున్నారు. ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమె భర్త హరిమోహన్ కూడా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ చేదోడుగా ఉంటున్నారు. మొటుకుపల్లి దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇప్పించారు.



విద్యార్థులకు బాక్సులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అలరించిన 'సత్యసాయి లీలావైభవం'



కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి లీలావైభవాన్ని కొనియాడుతూ విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సోమవారం సాయంత్రం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ సంగీత విభాగం విద్యార్థులు సత్యసాయి మహాసమాధి చెంత కచేరీ నిర్వహించారు. చక్కటి వాయిద్యాలతో వినసొంపైన స్వరాలతో ఆలపించిన గీతాలు మైమరిపించాయి. సత్యసాయి ప్రేమ తత్వాన్ని, ఆధ్యాత్మిక వైభవాన్ని కొనియాడుతూ సుమారు గంట పాటు కచేరీ నిర్వహించారు.

పంటలకు ప్రాణం



కప్పలబండ వద్ద పచ్చదనం సంతరించుకున్న వేరుశనగ

- 24 మండలాల పరిధిలో వర్షం

పుట్టపర్తి అర్బన్: ఇన్నాళ్లూ వరుణుడి కరుణలేక వాడుముఖం పట్టిన ఖరీఫ్ పంటలు తాజా వర్షాలతో కళకళలాడుతున్నాయి. వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలన్నీ పచ్చగా కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి. ఐదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రైతు మోములో ఆనందం కనిపిస్తోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 64 వేల హెక్టార్లలో వేరుశనగ, 20,275 హెక్టార్లలో కంది, రాగి, మొక్కజొన్న, కొర్ర, జొన్న, ఆలసంద, పెసర తదితర పంటలు సాగులో ఉన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మరో ఐదు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

24 మండలాల్లో వర్షం..

ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ జిల్లాలోని 24 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా ధర్మవరంలో 82.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కనగానపల్లిలో 54.2 మి.మీ, సీకేపల్లి 45.6 మి.మీ, నల్లమాడ 44.6 మి.మీ, కొత్తచెరువు 33.6 మి. మీ, బత్తలపల్లి 32.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. అలాగే బుక్కపట్నం 27.8 మి.మీ, పుట్టపర్తి 23.6, రామగిరి 22.4, ముదిగుబ్బ 20.4, తాడిమర్రి 17.8, కదిరి 15, ఓడీ చెరువు 12.2, తలుపుల 9.4, గోరంట్లలో 6.6, నల్లచెరువులో 6.2, తనకల్లు 5.4, గుడిబండ 5.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

కర్ణాటకలో కదిరి వాసి దుర్మరణం


భాగ్యమ్మ (ఫైల్)

కదిరి అర్బన్: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో కదిరి మండలం కె.బత్తలపల్లికి చెందిన భాగ్యమ్మ (50) మృతి చెందింది. ఈ నెల 2న తన భర్త సుధాకర నాయుడు, కుమార్తె శ్రావణితో కలసి కర్ణాటకలోని ధర్మస్థల మంజునాథ స్వామి దర్శనానికి కారులో వెళ్లారు. పూజాదికాలు ముగించుకున్న తర్వాత ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. హసన్ సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు బోల్తాపడింది. ఘటనలో భాగ్యమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

కొత్తచెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువులోని బీసీ కాలనీకి చెందిన పవన్‌కుమార్ (24) ఇటీవల వివాహమైంది. కూలి పనులతో జీవనం సాగించేవారు. ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో కుటుంబంలో మనస్పర్థలు చెలరేగాయి. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ ఆదివారం రాతఇర ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన పరిష్కారం చూపాలి

- అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలి
- 'స్పందన'లో కలెక్టర్ అరుణ్‌బాబు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: స్పందన కార్యక్రమంలో అందే ప్రతి అర్జీకి మెరుగైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందితేనే సమస్య పరిష్కారమైనట్లు గుర్తించాలన్నారు. సోమవారం ఆయన... జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 236 అర్జీలను అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడారు. 'స్పందన'లో రీ ఓపెన్ పిటిషన్లు నాలుగు వచ్చాయని, ఆయా శాఖల అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపితే మళ్లీ రీఓపెన్ కావని గుర్తుంచుకోవాలన్నారు. వీలైనంత వరకూ నేరుగా అర్జీదారునితో మాట్లాడితే ప్రతి సమస్యనూ సులువుగా పరిష్కరించవచ్చన్నారు. పిటిషన్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు, ఆర్డీఓలు క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, చేనేత జౌళి శాఖ జేడీ పద్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్ తదితరులు ఉన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీల్లో కొన్ని...

- పుట్టపర్తి మండలం పెడపల్లి రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 172-3లో వేసిన వెంచర్‌లో 32 మంది ప్లాట్లు కొనుగోలు చేశామని, ప్రభుత్వం ఇప్పుడా భూమిని ఎన్‌హెచ్ 342 కోసం తీసుకుంటోందని ప్లాట్ల యజమానులు కలెక్టర్‌కు తెలిపారు. సదరు భూమిని కన్వర్షన్ చేసినా తమకు అతి తక్కువ పరిహారం ఇస్తున్నారన్నారు. సహృదయంతో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.
- ప్రభుత్వానికి డ్వాక్రా సంఘాలకు అనుసంధానంగా పనిచేస్తూ వీఓఏలకు ఉద్యోగ భద్రత కరువైందని, 24 ఏళ్లుగా 'సెర్ప్' పరిధిలో పని చేస్తున్నా.. తమ కష్టానికి గుర్తింపు లభించడం లేదని పలువురు వీఓఏలు కలెక్టర్ అరుణ్‌బాబు ఎదుట వాపోయారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, పదోన్నతి సౌకర్యం కల్పించాలని కోరారు.
- సోమందేపల్లి మండలం మాగేపల్లి గ్రామ సర్వే నంబర్ 202-5లోని 25 సెంట్ల స్థలం తనకు వారసత్వంగా వచ్చిందని, కానీ కొంతమంది కబ్జాచేసి బెదిరిస్తున్నారని వెంకటరాముడు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.
- రేషన్ కార్డులో తప్పులు దొర్లడంతో బియ్యం తీసుకోలేకపోతున్నామని గాండ్లపెంట మండలం మల్లమీదపల్లికి చెందిన భారతి కలెక్టర్‌కు తెలిపారు. కుటుంబం గడవడం చాలా ఇబ్బందిగా ఉన్నందున తన కుటుంబంలోని వారందరికీ బియ్యం అందేలా చూడాలని కోరారు.

దివ్యాంగుడి కోసం మెట్టు దిగిన ఎస్పీ

- 'పోలీసు స్పందన'కు 42 వినతులు


దివ్యాంగుడు శ్రీనివాసులు అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సమస్య పరిష్కారానికి స్వయంగా జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఓ మెట్టు కిందకు దిగి వచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తన సమస్య ఏకరవు పెట్టేందుకు వచ్చిన దివ్యాంగుడిని గౌరవిస్తూ డయాస్ పైనుంచి కిందకు దిగి వచ్చి దివ్యాంగుడితో పాటు తాను అక్కడే కూర్చొని మాట్లాడారు. వివరాలు.. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 1వార్డు కొట్నూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీనివాసులు దివ్యాంగుడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కొట్నూరులోని సర్వే నంబర్ 43-02ఏ లో ఆయన మూడు సెంట్ల (ప్లాట్ నంబర్ 919) స్థలాన్ని 2009లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆర్థిక ఇబ్బందులు కారణంగా అప్పట్లో ఆయన ఇల్లు కట్టుకోలేకపోయారు. ప్రస్తుతం ఇల్లు కట్టుకునేందుకు సిద్ధపడి, అందుకు అవసరమైన సామగ్రి అక్కడ తరలించాడు. విషయం తెలుసుకున్న మెతుకుపల్లికి చెందిన శేఖర్ అనే వ్యక్తి అడ్డుకుని 2016లో తనకు ఆ స్థలంపై ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, అక్కడ ఇల్లు కట్టేందుకు వీల్లేదంటూ అడ్డుకున్నాడు. ఈ విషయంగా తనకు న్యాయం చేయాలంటూ హిందూపురం వన్‌టౌన్ పోలీసుకు ఫిర్యాదు చేసినా సమస్యకు పరిష్కారం దక్కలేదు. దీంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలిసేందుకు ప్రయత్నం చేశాడు. ఆయన పరిస్థితిని గమనించిన ఎస్పీ స్వయంగా డయాస్‌పై నుంచి కిందకు దిగి శ్రీనివాసులు కూర్చొన్న కుర్చీ పక్కనే మరో కుర్చీ వేసుకుని సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. అనంతరం హిందూపురం సీఐ ఈరన్నకు ఫోన్ చేసి, వివరాలు ఆరా తీశారు. శ్రీనివాసులుకు న్యాయం చేయాలని ఆదేశించారు. దివ్యాంగుడి పట్ల ఎస్పీ స్పందించిన తీరును గమనించిన పలువురు అర్జీదారులు హర్షం వ్యక్తంచేశారు. కాగా, పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 42 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్ట పరిధిలోని సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను వెనువెంటనే ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, సీఐ సతీష్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

25లోపు ఓటరు రీసర్వే పూర్తి కావాలి


కొండంపల్లిలోని 187 పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్/ పెనుకొండ రూరల్: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అందిన దరఖాస్తుల రీసర్వే ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, సబ్ కలెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేలో వచ్చిన మార్పులు చేర్పులు, తొలగింపులపై రీ సర్వే పక్కాగా చేపడుతున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇంటింటి సర్వే, జంక్ క్యారెక్టర్ల సవరణ వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే తొలగించిన ఓటర్లకు సంబంధించి రీ వెరిఫికేషన్ ఈనెల 7వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, మౌలిక వసతులకు సంబంధించి పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, మడకశిర ఎన్నికల అధికారి చిన్నయ్య, కలెక్టరేట్ డీటీలు మైనుద్దీన్, భాస్కర్, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ పెనుకొండ మండలంలోని వెంకటరెడ్డిపల్లి 167, 168 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ స్వర్ణలత, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ హనుమంతుతో కలిసి కొండంపల్లిలోని 187 పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లు అనితా బాయి, చౌలి బాయి ఇళ్లను సందర్శించి ముఖాముఖి అయ్యారు. బీఎల్‌ఓలు ఇంటి సందర్శనకు వచ్చారా..? లేదా..? అని అడిగి తెలుసుకున్నారు.

బీకేకు సొంతింట్లో మంట

- రెండోరోజూ సమావేశమైన అసమ్మతి నేతలు
- బీకే వైఖరిపై చంద్రబాబుకు ఫిర్యాదు చేయాలని నిర్ణయం


చంద్రబాబును కలిసే విషయమై చర్చిస్తున్న టీడీపీ ముఖ్య నాయకులు

పెనుకొండ: టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథికి సొంతింట్లోనే నిరసనల సెగ తాకుతోంది. బీకేకు వ్యతిరేకంగా ఉన్న పలువురు అసమ్మతి నాయకులు వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సమావేశమైన జెడ్పీటీసీ మాజీ సభ్యులు నారాయణస్వామి, మాధవనాయుడు, మంచినీళ్ల సూరి, రంగేపల్లి వెంకటరమణ, పెనుకొండ, రొద్దం టీడీపీ మాజీ మండల కన్వీనర్లు శ్రీరాములు, చంద్రమౌళి, రంగప్ప, నంజప్ప తదితరులు సోమవారం కూడా తమ కార్యాచరణ గురించి చర్చించినట్లు తెలుస్తోంది. టీడీపీ వర్గాల సమాచారం మేరకు...పెనుకొండ నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, గ్రూపులు, ఇతర విషయాలను పార్టీ అధినేత చంద్రబాబుకు వివరించే విషయమై ప్రధానంగా చర్చించారు. ప్రతి గ్రామంలో టీడీపీలో గ్రూపులు ఏర్పడ్డాయని, నేతలందరినీ ఏకతాటిపై నడిపించాల్సిన పార్టీ అధ్యక్షుడు బీకే పార్థసారథి గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని నేతలంతా ఆగ్రహించారు. అదే విషయాన్ని చంద్రబాబుకు వివరించాలని తీర్మానించారు. పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడిన ముఖ్య నాయకులను, సీనియర్లను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విషయాలను చంద్రబాబుకు వివరించాలని నిర్ణయించారు. ఇప్పటికే వీరు మాజీ ఎమ్మెల్యే బీకేకి వ్యతిరేకంగా, సవితమ్మకు మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది రోజుల్లో పెనుకొండలో టీడీపీ నాయకుల గ్రూపు రాజకీయాలు మరింత జోరందుకోనున్నాయి.

వాహనం ఢీ - వ్యక్తి మృతి


ముద్దహనుమప్ప (ఫైల్)

మడకశిర రూరల్: వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం ఈచలెడ్డి గ్రామానికి చెందిన ముద్ద హనుమప్ప(75) సోమవారం ఉదయం తన మనుమడిని బుళ్లసముద్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో వదిలి ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనాన్ని తిప్పుకుంటున్న సమయంలో మడకశిర నుంచి హిందూపురానికి వెళుతున్న ఓమినీ వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన ఓమినీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన హనుమప్పను స్థానికులు వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు తపాలా శాఖ బంపర్ ఆఫర్

అనంతపురం సిటీ: ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు తపాలా శాఖ బంపర్ ఆఫర్ ప్రకటించింది. దీన్ దయాళ్ స్పర్శ యోజన కింద అనంతపురం తపాలా శాఖ డివిజన్ పరిధిలోని విద్యార్థులకు డీడీఎస్‌వై పరీక్ష నిర్వహించనున్నట్లు అనంతపురం హెడ్ పోస్ట్‌మాస్టర్ భానుకుమార్ సోమవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏడాదికి రూ.6 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. పోస్టాఫీసుల్లో ఫిలాటెలిక్ డిపాజిట్ ఖాతా (పీడీఏ) కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి సమాచారానికి అనంతపురంలోని హెడ్ పోస్టాఫీసులో సంప్రదించాలని పేర్కొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ప్రత్యేక చికిత్స

హిందూపురం టౌన్: ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్ కలిగిన పెన్షనర్లు, ఉద్యోగులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నట్లు స్థానిక జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పెన్షనర్లు, ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈహెచ్‌ఎస్ క్రానిక్ ఓపీ సెంటర్‌ను ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, ఆరోగ్యశ్రీ జిల్లా అధికారి శివకుమార్‌తో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఆరోగ్యశ్రీ సేవల్లో భాగంగా ప్రభుత్వ అసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. 40 ఏళ్లు పైబడిన వారందరికీ 25 రకాల దీర్ఘకాల వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణలతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఇందు కోసం రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఓపీకి వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు చక్రధర్, సునీల్, డేవిడ్ రాజు, శ్రీకాంతి, పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, ఆరోగ్య మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్‌బాబు

రొళ్ల: స్థల వివాదంలో ఓ వ్యక్తిని హతమార్చిన కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ వెంకటరమణతో కలసి సీఐ సురేష్ బాబు సోమవారం వెల్లడించారు. రొళ్ల మండలం గిరేనాయకనపాళ్యంలో రస్తా విషయంలో ఆగస్టు 31న శ్రీరంగప్ప, గౌడయ్య కుటుంబసభ్యులు గొడవపడ్డారు. ఆ సమయంలో శ్రీరంగప్ప వర్గీయులు దాడిలో బలమైన దెబ్బలు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన గౌడయ్య (59)ను కుటుంబసభ్యులు కర్ణాటకలోని మధుగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనకు సంబంధించి గౌడయ్య కుమార్తె లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. సీఐ సురేష్‌బాబు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం పిల్లిగుండ్ల గ్రామ సమీపంలో ఆటో కోసం ఎదురు చూస్తున్న శ్రీరంగప్ప, అతని కుటుంబసభ్యులు రత్నమ్మ, రాధమ్మ, అరుణ, బొమ్మలింగప్ప, రంగనాథ్‌ని గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నేరం అంగీకరించడంతో నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వర్సిటీల పరిధిలో ఉద్యోగ జాతర


నూతన పాలకమండలి సభ్యులతో జేఎన్‌టీయూ (ఏ)వీసీ జింకా రంగజనార్దన


ఎస్కేయూ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులు

- త్వరలో నోటిఫికేషన్ జారీ
- జేఎన్‌టీయూ(ఏ)లో 296 పోస్టుల భర్తీకి పాలకమండలి ఆమోదం
- ఎస్కేయూలో 268 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

అనంతపురం: ఉన్నత విద్యను అభ్యసించి, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు జేఎన్‌టీయూ(ఏ), ఎస్కేయూ నూతన పాలక మండలి సభ్యులు తీపి కబురు వినిపించారు. ఆయా వర్సిటీల పరిధిలో ఖాళీగా ఉన్న వందలాది ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో నోటిఫికేషన్ల జారీకి రెండు యూనివర్సిటీల యాజమాన్యాలు రంగం సిద్ధం చేస్తున్నాయి.

మొత్తం 564 పోస్టుల భర్తీకి చర్యలు..

జిల్లాకే తలమానికంగా ఉన్న జేఎన్‌టీయూ(ఏ), ఎస్కేయూ పరిధిలో మొత్తం 564 పోస్టుల భర్తీకి ఆయా వర్సిటీల నూతన పాలక మండలి సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో ఎస్కేయూ పరిధిలో 268 పోస్టులను భర్తీ చేయనుండగా, జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో 296 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్కేయూలో 35 ప్రొఫెసర్, 65 అసోసియేట్ ప్రొఫెసర్, 168 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అనుమతి లభించింది. ఇప్పటికే భర్తీ కాగా, మిగిలిన పోస్టుల్లో అర్హులను ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించిన రూల్‌ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు నిర్ధారణ అయింది. వీటికి ఎస్కేయూ పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో 26 ప్రొఫెసర్, 50 అసోసియేట్ ప్రొఫెసర్, 220 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు. అయితే ఇందులో ఇప్పటికే భర్తీ చేసిన పోస్టుల మినహా మిగిలిన వాటిని భర్తీ చేయనున్నారు.

తొలి సమావేశంలోనే విప్లవాత్మక నిర్ణయాలు

జేఎన్‌టీయూ (ఏ) నూతన పాలక మండలి సభ్యులుగా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ వి.వసుంధర, డాక్టర్ డి.జ్యోతీశ్వరి, డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి, డాక్టర్ జి.మేరీమాత, జీవీఎం మోహన్‌కుమార్, డాక్టర్ డి.హరిశ్చంద్ర రామ, డాక్టర్ ఎం.వంశీకృష్ణను ఆ వర్సిటీ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం వర్సిటీలోని పాలక భవనంలో నూతన సభ్యులతో వారు సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా పాలనపరమైన పలు అంశాలపై సుదీర్ఘ చర్చ సాగింది. అలాగే ఎస్కేయూలో నూతన పాలక మండలి సభ్యులు సోమవారం తొలి సమావేశం నిర్వహించారు. సభ్యులు ప్రొఫెసర్ ఎం. మునినారాయణప్ప, ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి, డాక్టర్ జేవీవీఎస్ కేశవరావు, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, రామిరెడ్డి, దేశాయి మదన్‌మోహన్ రెడ్డి, ఇలియాజ్ అహమ్మద్, కొమ్ము విజయభాస్కర్‌ను ఆ వర్సిటీ వీసీ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య అభినందించారు. కాగా, రెండు వర్సిటీల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి నూతన సభ్యులు విప్లవాత్మక నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పంచాయతీరాజ్‌లో పలువురికి పదోన్నతి

- ఉమ్మడి జిల్లాలో నలుగురు డీఈఈలకు ఈఈలుగా అవకాశం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ఇంజినీరింగ్ విభాగంలో పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి నలుగురు డీఈఈలు పదోన్నతుల జాబితాలో ఉన్నారు. వారిలో పీఐయూ-కళ్యాణదుర్గం డీఈఈగా ఉంటూ అనంతపురం ఇన్‌చార్జ్ ఈఈగా వ్యవహరిస్తున్న శంకరయ్య, హిందూపురం డీఈఈగా పని చేస్తూ పెనుకొండ ఇన్‌చార్జ్ ఈఈగా వ్యవహరిస్తున్న బండారు మురళీమోహన్, పీఆర్ ఎస్‌ఈ కార్యాలయ ఆవరణలోని సెంట్రల్ ల్యాబ్‌లో పని చేస్తున్న జి.రవి, గతంలో మడకశిరలో పని చేసి, ప్రస్తుతం కడపలో విధులు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్‌కు పదోన్నతులు లభించనున్నాయి. వీరందరికీ ఒకట్రెండు రోజుల్లోనే పోస్టింగులు రానున్నాయి.

ఈఈలుగా పదోన్నతి

అనంతపురం క్రైం: జిల్లాలోని నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఈసోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అహుడాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న జి.సూర్యనారాయణ పదోన్నతిపై అనంతపురం నగరపాలక సంస్థ ఈఈగా నియమితులయ్యారు. అలాగే ధర్మవరం మునిసిపాలిటీలో పనిచేస్తున్న డీఈఈ కె.సుధారాణి అనంతపురం నగరపాలక సంస్థ ఈఈగా నియమితులయ్యారు. గుంతకల్లు మునిసిపాలిటీలో డీఈగా ఉన్న గురప్పయాదవ్ అదే మునిసిపాలిటీలో ఈఈగా నియమితులయ్యారు. గుత్తి మునిసిపాలిటీ డీఈ ఉన్న ఇంతియాజ్ అలీ ఒంగోలు మునిసిపాలిటీ ఈఈగా నియమితులయ్యారు.

శనగల వ్యాపారిపై రైతుల ఫిర్యాదు


ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

బొమ్మనహాళ్: కష్టపడి పండించిన పంటను దళారీ తీసుకెళ్లి డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడంటూ పోలీసులకు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. బొమ్మనహాళ్‌కు చెందిన విక్రమ్... రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలోనే కొన్నేళ్ల క్రితమే తన మకాంను బళ్లారికి మార్చిన విక్రమ్.. అప్పుడప్పుడు వచ్చి తన వ్యాపార లావాదేవీలు చూసుకుని వెళ్లేవాడు. రబీ సీజన్ కింద ఇటీవల వందలాది మంది రైతులు పండించిన పప్పు శనగ ఉత్పత్తులను అనామతు (రైతుకు ఇష్టం వచ్చిన సమయంలో అప్పటి గరిష్ట ధరకు విక్రయించడం) కింద సేకరించుకున్న ఆయన.. ఐదు రోజులుగా పత్తాలేకుండా పోయాడు. దీంతో తాము మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని సల్లాపురం, హనకనహాల్, తదితర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోదాముల్లో నిల్వ చేసిన శనగ పంటను తమకు అందించాలని కోరారు.